# ఈ ఘోషకు అంతమెప్పుడో?



"చీర కుచ్చెళ్ళను ఆమె ఒక చేత్తో పైకెత్తి పట్టుకొనింది. ఇంకొక చేత్తో అందమైన చేతిరుమాల్ని ముక్కుకు అడ్డంగా పెట్టుకొనింది. ఫైలు మోయడానికి మరొక చెయ్యి లేదు కాబట్టి ఆ చేత్తోనే ఫైలును గుండెలకదిమి పట్టుకొనింది. అడుగు తీసి అడుగు పెట్టడానిక్కూడా ఆలోచిస్తూ అంతకంటే సంకోచిస్తూ ఆ హరిజనవాడలో అడుగుపెట్టింది.

చుట్టూ బురదగుంటలు. ఆ గుంటల్లో పొర్లాడుతూ పందులు. ఇంటింటి వెనకా ఒక దిబ్బ. ప్రతి ఇంటిముందు ఒక జలదారి. దాని నిండుకు మురుగునీళ్ళు. ఆ నీళ్ళమీద విహరిస్తూ ఒక్కొక్కటీ ఈత గింజల్తో పోటీపడే దోమలు. ఎక్కడ పడ్తే అక్కడ మల మూత్ర విసర్జనాల్తో ముక్కుపుటాల్నదరకొడ్తూ దుర్గంధం– మానస సరోవరంలో విహరించే హంసను నిర్దాక్షిణ్యంగా పట్టి తెచ్చి ఒక్కసారిగా బురదగుంటలో వదిలినట్లయింది– ఆమె పరిస్థితి!

ఆమె పేరు అరుణ! అరుణ ఆ హరిజనవాడలో అడుగుపెట్టేసరికి ఆమెకొక సినిమాస్టార్ స్టేటస్ వచ్చేసింది. చూస్తూ చూస్తూ ఉండగానే ఆడామగా బిలబిలా వచ్చి ఆమె చుట్టూ మూగారు.

ఉన్నట్లుండి ఒకదేవత దిగివస్తే– 'ఎందుకు వచ్చిందో? ఏమో?' అన్న సందేహం అయోమయంలో పడేస్తే అందరూ ఆమెవైపు అదోరకంగా చూస్తున్నారు. అందరూ తనవైపు అయోమయంగా చూస్తూ ఉంటే– అరుణ వాళ్ళందర్నీ ఆశ్చర్యంగా చూసింది.

కొంతమంది ఆడవాళ్ళకు పైటలు మినహాయిస్తే రైకలు కూడా లేవు. ఒంటిమీది చర్మాన్ని పొడుచుకొనివచ్చినట్లుగా ఎముకలు నిక్కి నిక్కి చూస్తున్నాయి. తోలుతిత్తుల్లా వేలాడుతున్న రొమ్ముల్ని పుల్లలాంటి పిల్లలు చంకన కూర్చొని చీకుతున్నారు. గోచీకూడా లేని అయిదారేండ్ల వయస్సు పిల్లలు తల్లుల కొంగుచాటున నిలబడి భయం భయంగా చూస్తున్నారు. కొంతమంది మగరాయుళ్ళు మాత్రం ఆమెను ఎగాదిగా చూస్తున్నారు.

ఆమెకు అది ఒక చిత్రలోకంలో అడుగుపెట్టినట్లు అనిపిస్తూ ఉంది. అరుణ నాలుగంకెల జీతగాడి కడుపున పుట్టింది. ఇద్దరి కొడుకుల మధ్య కూతురుగా అపురూపంగా పెరిగింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పువ్వుల్లో పువ్వుగా తిరుగుతూ ఉంది. పువ్వుల్నే చూడడానికి అలవాటుపడిన కండ్లకు ఎండుపుడకల్ని చూడడం విచిత్రంగానే ఉంటుంది.

ఆ విచిత్ర వాతావరణాన్ని కాసేపు నిశ్శబ్దం భరించింది.

అరుణ వాళ్ళవైపు తదేకంగా చూస్తూనే– 'ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి?' అని ఆలోచిస్తూ ఉంది.

వాళ్ళు ఆమెవైపు చూస్తున్నారు. ఆ తరువాత ఒకరినొకరు చూసుకొంటున్నారు. అంతలో "మీరు బాంకోళ్ళామ్మా?"

ఎవరో ఒకావిడ ధైర్యంచేసి అడగనే అడిగింది. అలా అడగడంతో ఇరు వర్గాలు విచిత్రావస్థ నుండి వాస్తవ స్థితిలోకి వచ్చాయి.

ఆ మాటలతో అరుణ ఉలిక్కిపడింది. వెంటనే కలవరపాటును కప్పిపుచ్చుకోగలిగింది. కానీ నోరు మాత్రం పెగలల్లేదు. అందుకే 'కాదు!' అన్నట్లుగా తల అడ్డంగా తిప్పింది.

"అయితే ఇంకెవుర్నువ్వు?" అని అందరూ చూపుల్తోనే గుచ్చి గుచ్చి అడుగుతున్నట్లుంది. 'అమ్మా! యూనివర్శిటీలో నేను ఒక స్టూడెంట్ని. సోషియాలజీ నా సబ్జెక్టు. థియరీ పూర్తి చేశాను. నా రీసెర్చి పూర్తికావాలంటే– ప్రాక్టికల్‌గా కొంత ఫీల్డ్ వర్క్ చేయాల్సి ఉంది. అందులో భాగంగా వృద్ధుల్ని ఇంటర్వ్యూ చెయ్యడానికొచ్చాను'. అని చెప్తే వాళ్ళకు అర్థమవుతుందా? అర్థమైనా వాళ్ళు ఎంతవరకు తనతో సహకరిస్తారు? అని ఆలోచిస్తూ ఉంటే–

"పదండి!... పదండి!!– ఆఁవెతో మనకేం పని?" అని వాళ్ళలో వాళ్ళే గొణుక్కొంటూ ఎవరి దారి వాళ్ళు చూసుకొంటున్నారు. కొంతమంది ఆడవాళ్ళు మాత్రం అటూ ఇటూగా ఊగిసలాడుతూ అక్కడే నిలబడ్డారు.

"పాపం! వాళ్ళు నన్ను అప్పులివ్వడానికొచ్చిన బ్యాంక్ ఆఫీసర్ అని అనుకొన్నట్లుంది. 'కాదు!' అనడంతో వాళ్ళ ఆశ నిరాశ అయింది. అవసరాలు తీర్చలేని వాళ్ళతో వాళ్ళకేం పని? అందుకే వెళ్ళిపోతున్నారు!" అని అరుణ తనలోతాను అనుకొంటూ ఉంటే–

"ఏం పనిమీదొచ్చినారమ్మా?" అని ఇంకొకావిడ అడిగింది.

"కొందరు ముసలోళ్ళతో మాట్లాడాలని వచ్చాన్నేను!"

ఆమె నోట్లో మాట నోట్లో ఉండగానే అక్కడ మిగిలిన వాళ్ళందరూ గిరుక్కున వెనక్కు తిరిగారు. దాదాపు పరుగందుకొన్నట్లుగా అందరూ ఒకేసారి వెళ్ళిపోతే– ఆ నడివీధిలో అరుణ ఒంటరిగా నిలబడింది ఏం చేయాలో తోచకుండా!

అయిదు నిముషాలైనా గడిచిందో లేదో తన కండ్లను తానే నమ్మలేకపోయింది! ముగ్గుబుట్టలా పండిన తలలు కొన్ని.... వంగిన వెన్నెముకలు కొన్ని.... కాలూ చెయ్యి కూడా ఆడని ఉడిగిన ప్రాణాలు కొన్ని... కొందరు ఊతకర్రలమీద వంగి– నడవలేక నడుస్తున్నారు. కొందర్ని రెక్కల బలవంతాన పట్టి నడిపించుకొస్తున్నారు. కాలూ చెయ్యి ఆడుతున్న వాళ్ళు మాత్రం పడ్తూ లేస్తూ వస్తున్నారు. వాళ్ళు నడుస్తున్న తీరు చూస్తే ఏదో వారుకోవాలన్న ప్రాకులాట అందరి ముఖాల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తూ ఉంది.

"క్షణాలమీద ఈ వార్త ఎలా ప్రాకింది? ఇంతమంది వస్తున్నారే?" అని అరుణ ఆలోచిస్తూ వాళ్ళవైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉంది.

ఆమె అనుకొంటూనే ఉంది. ఆలోపుగా వాళ్ళు రానే వచ్చారు. ఆమెను చుట్టుముట్టారు. "నా పేర్రాసుకోమ్మా!.. నా పేర్రాసుకో తల్లీ!" అని అంటూ ఒకరి ముందొకరుగా ఆమె మీదికి ఎగబడుతున్నారు.

వాళ్ళు అడుగుతున్నదేమిటో అర్థం కాకుండా అరుణ అందర్నీ అలాగే చూస్తూ ఉంది.

"నా పేర్రాసుకోని పొయ్ ఆర్నెల్లయిపొయ్యింది తల్లీ! ఇయ్యారవకు అతీగెతీ లేదు. ముందుగా నా పేర్రాసుకోని ఆ కతేఁవయిందో సూడు తల్లీ! సచ్చి నీ కడపన పుట్తాను!" తన సీనియారిటీని గుర్తుచేస్తూ తనకు జరిగిన అన్యాయాన్ని ఏడుపు స్వరంతో వినిపించిదొక ముసల్ది.

"వచ్చొచ్చి రాసుకోని పొయ్యేదేనా? మా రాతలేవన్నా మార్సేదుండాదా లేదా?" మరొక ముసల్ది నిలదీసి అడుగుతూ ఉంది.

పరిశోధనలో పరిణితి సాధించిన ఆ బుర్రకు అప్పటికి కానీ అందలేదు– వాళ్ళందరూ అడుగుతున్నది వృద్ధాప్యపు పెన్షననీ, ఆ పెన్షన్ ఇచ్చే అధికారిణి తానేనని!

"అమ్మా! ఆ అదృష్టవంతురాన్ని నేను కాను. ఆ మాత్రం భాగ్యానికి నేను నోచుకోలేదు. నేను వృద్ధాప్యపు పెన్షన్ మంజూరు చేసే అధికారిని కాను! అని వాళ్ళతో ఎలా చెప్పాలి? చెప్పి ఆ మొగాల్ని ఎలా చూడాలి?" అని ఆలోచిస్తూ ఉంటే– ఆమెకు తెలియకనే తల వాలిపోయింది.

వాళ్ళకు చదువుసంధ్యలు లేకపోవచ్చు. ఒకపూటకు ఉంటే ఇంకొక పూటకు లేకపోవచ్చు. గుడిసెల్లో బతుకుతూ ఉండవచ్చు. కానీ వాళ్ళు గడించిన జీవితానుభవం మాత్రం చిన్నది కాదు. ఆశల మూటల్ని మోసుకొనివచ్చి ఎంతమంది ఆ గుడిసెల్లో విప్పి కండ్లు కప్పారో,

కష్టపుతున్నారో వాళ్ళకు బాగా తెలుసు. అందుకే క్షణాలమీద వాళ్ళు ఆమె నిస్సహాయ స్థితిని పసికట్టారు.

"అయితే నువ్వు ముసలోళ్ళతో మాట్లాడాలనింది ఉత్తుత్త మాటలేనా? ఈ పీనిగిల కేడేడ్సిందిలే అంత ఓపిక?" అని ఎవరికి తోచినట్లు వాళ్ళు గొణుక్కుంటూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆదిలోనే హంసపాది. తన మొదటి ప్రయత్నమే అనుకోనట్లుగా ఇలా విఫలమవుతుందని ఆమె ఊహించలేదు. "ఇకనేం చేయాలి? పోనీ! ఎవరికైనా దబ్బాశ చూపితే?" అని ఆలోచిస్తూ ఆమె వీధివైపు తేరిపార చూసింది. ఆమెలో ఆరిపోతున్న ఆశ చిగురించింది. వెలవెలబోతున్న మొగంలో కొత్త వెలుగు చోటుచేసుకొనింది. గబగబ ఆ గుడిసె ముందరికి నడిచింది.

ఆ గుడిసె ముందర ఒక కుక్కిమంచం. ఆ మంచంమీద ఒక ముసల్ది. ఎముకలగూడును వెల్లకిల పడుకోబెట్టినట్లుంది. ఆ ఎముకల గూడు వస్తూ పోతున్న వాళ్ళవైపు దీనంగా చూస్తూ ఉంది. అరుణ ఆమె పక్కన నిలబడేసరికి ముడతలుపడిన మొగంలో వివరణకందని వింతకాంతి!

అరుణను చూడగానే ఆ ముసల్ది లేవడానికి ప్రయత్నించింది.

"వద్దవ్వా వద్దు! నువ్వు లెయ్యద్దు!" అంటూనే అరుణ ఆమె ప్రక్కన్నే ఆ కుక్కి మంచంమీద కూర్చొనింది. అప్పుడు చూడాలి ఆ ముసలి ప్రాణిలో సంబరం. అంబారీ ఎక్కినంతగా ఆనందపడ్తూ ఉంది.

"అవ్వా! ఇంతమంది నా దగ్గరికొచ్చారే? మరి నువ్వు రాలేదేం?"

"ఎట్లా రమ్మంటావ్ తల్లీ! కూసుంటే లెయ్‌లేను. లేస్తే కూసోలేను!"

"ఏం? నీకెవ్వరూ లేరా అవ్వా?" అని అడుగుతూనే ఆ ముసల్ది ఏం చెబుతుందో ఏమో రాసుకొందామని అరుణ కాగితం కలం చేతికందుకొనింది.

"లేకేం తల్లీ! ఉండారు. దండిగా ఉండారు. కట్టుకున్నోడు సొర్గంలో ఉండాడు. రెక్కలొచ్చేదాకా కూతుర్లూ, కొడుకులూ ఉండ్రి. నాకు రెక్కలుడిగిపొయ్యేకుందికి వాళ్ళకు రెక్కలొచ్చినాయి. ఎవళ్ళ దోవ వాళ్ళదయిందీ!"

"నీకెంతమంది బిడ్డలవ్వా?"

"ఈరుళ్ళూ సూరుళ్ళు మాదిరిద్దురు కొడుకులు, ముగ్గురు కూతుర్లు!"

"అయితే ఒక్కరు కూడా నిన్ను చూసుకోవడం లేదా అవ్వా?"

"ఎందుకు సూసుకోవాలమ్మా? నాదగ్గిరేంవన్నా మళ్ళూ మాన్యాలా? గుళ్ళూ గోపరాలా?"

"ఏంవుండి ఏమి లేకపోయినా బాధ్యత ఒకటుందవ్వా? కూలీ నాలీ చేసి అయినా వాళ్ళు నిన్ను సాకాలి కదా?"

"సెట్టుకొమ్మకు కోక ఉయ్యాల గట్టి పిల్లోళ్ళను ఆ ఉయ్యాల్లో పొణుకోపెట్నా. పనీ పాట సేస్తావున్నా ఒక కన్ను వాళ్ళమిందనే! అట్టా నేను వాళ్ళను సాకినానని నన్ను వాళ్ళు సాకాలని యాడైనా రాసిపెట్టి ఉండాదామ్మా?... అడ్డాల్నాడు బిడ్డలే కానీ..."

"అదేంటవ్వా అలా అంటావే! ఢిల్లీకి పాదుషాలైనా తల్లికి కొడుకులే కదా?"

"వాళ్ళు మన బిడ్డలైతే వాళ్ళకొచ్చినోళ్ళు..."

"అయితే నీ బతుకు?"

"ఏంవుంది తల్లీ! ఎప్పుడో ఒక కూతురొస్తుంది. ఉంటే పావలా అర్ధా సేతిలో పెడ్తింది. లేకపోతే శాపనార్థాలు పెట్టిపోతింది. ఇవి ఊళ్ళు కదమ్మా? అడువులా? ఎవురో ఒకరు దయతల్సి నా మొకానంత కొడ్తా ఉండారు. నేనూ దినాలు లెక్కపెట్టుకుంటూ ఉండా!"

ఆ మాటలు చెవిని పడ్తూ ఉంటే అరుణ మనసు ఆర్ద్రమయింది. 'వార్ధక్యం ఇంత భారమా?' అని ఆలోచిస్తూ 'వెళ్ళొస్తానవ్వా!" అంటూ పైకి లేచింది.

"అంతా సుబ్బరంగా రాసుకుణ్ణావు గదమ్మా! నాలుగు రూకలు తొందరగా వచ్చేటట్టు సూడు తల్లీ! ఈ పాడుకట్టెలో పాణం ఎప్పుడు పోతుందో? ఏంవో?"

ఆ ముసల్దాని ఆశ కూడా వృద్ధాప్యపు పెన్షన్‌మీదే! ఆ తలంపే అరుణ గుండెల్ని తోడింది. మారు మాట్లాడకుండా పర్సు తీసి పది రూపాయలు ఆ ముసలిదాని చేతిలో పెట్టింది.

ఆ ముసల్ది ఆ నోటును కండ్లలో పెట్టుకొన్నట్లుగా అటు తిప్పి ఇటు తిప్పి చూసింది. ఆ కాగితం విలువ ఆమెకు తెలిసినట్లుంది. తృప్తితో మొగం వెలిగిపోతుంటే – "నా ఆయుస్సు పోసుకోని నూరేండ్లు సల్లంగా బతుకు తల్లీ! పాడె కర్సుకన్నా అవితింది!" అని గొణుక్కొంటూ బొడ్లో దోపుకొనింది.

అరుణ కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఒక్క క్షణం అక్కడ నిలబడలేకపోయింది. అడుగుమీద అడుగ్గా వంచిన తలెత్తకుండా వాడలో నుంచి ఊళ్ళోకి నడుస్తూ ఉంది. బస్సు దిగి దాదాపు రెండు కిలోమీటర్లు హరిజనవాడకు, అక్కడినుంచి ఒక్క కిలోమీటర్ ఊళ్ళోకి నడుస్తూంటే కాళ్ళు పీకుతున్నాయి. అలవాటులేని ప్రాణం. ఎండలో పడిన తామరతూడులా ఉంది ఆమె పరిస్థితి. అయినా పట్టుదలే ఆమెను ముందుకు నడిపిస్తూ ఉంది.

పొద్దు నడిమిట్టకు వస్తూ ఉంది. అరుణ కాళ్ళు బరువుగా పడ్తున్నాయి. ఏ ఇంట్లో అయినా అడిగి గుక్కెడు నీళ్ళు తాగి ఇంకొకర్ని ఇంటర్వ్యూ చేస్తే చాలు! అని ఆలోచిస్తూ ఉంది. నడుస్తున్నా వాడలో కుక్కిమంచం మీది ముసల్ది 'పాడె కర్సుకైనా అవుతుంది!' అన్న మాటలే చెవుల్లో గింగుర్లాడుతున్నాయి. 'ఊళ్ళో ఎవరితో మాట్లాడాలో? ఎవరితో మాట్లాడ్తే ఏం వినవలసి వస్తుందో? విని తమాయించుకొనే శక్తి ఈ గుండెకుందా?' అని సందేహిస్తూ మెల్లగా నడుస్తూ ఉంది.

ఉన్నట్లుండి ఆమె ఆ గుడి ముందర ఆగిపోయింది. కలమాగిన పండు తొడిమ వీడి నేలమీద పడి బాగా మగ్గి ముడతలు ముడతలైనట్లుంది ఆ గుడి తిన్నెమీద ముడుక్కొని ఉన్న తాతను చూస్తుంటే! ఏ ఇంటికి వెళ్ళే అవసరం లేకనే తన అవసరం తీరిందన్న ఆనందంతో అరుణ తాత దగ్గరికి నడిచింది.

తాత నిమిలిత నేత్రుడై తనలో తాను ఏదో గొణుక్కుంటున్నాడు.

అరుణ "తాతా!" అని పిలిచింది అతని ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ.

ఆ పిలుపు తాత చెవిని పడింది. అది అలవాటైన పల్లెటూరి పిలుపు కాదు. ఆ పిలుపులో ఏదో ఆత్మీయత, అనురాగం, తాత చలించాడు. నెమ్మదిగా కన్నులు తెరిచాడు. అంత ఆప్యాయంగా పిలుస్తున్న ఆ కొత్త మనిషి 'ఎవరబ్బా?' అన్నట్లుగా కన్నులు చికిలించి చూశాడు. గుర్తు దొరకలేదు. అందుకే సందేహంగా– "ఎవురమ్మా నువ్వు?" అని అడిగాడు.

"నేను పట్నం నుండి వచ్చాను తాతయ్యా!"

"ఎవురింటికమ్మా?"

"ఎవరింటికీ కాదు– మీ కోసమే తాతయ్యా!"

"హ్హొహ్హొహ్హో!" ఒక మహా వేదాంతిలా నవ్వాడు తాతయ్య.

"ఎందుకు అలా నవ్వుతున్నావు తాతయ్యా?"

"ఏడవలేక నవ్వుతారంటారే! సరిగ్గా అట్లాంటిదేనమ్మా ఈ నవ్వు! లేకుంటే నా వాళ్ళే నాకోసరం రారే! నువ్వెవరో గుర్తుకు కూడా రాలేదు. నాకోసరం వొచ్చినావా?" నవ్వును పొడిగించాడు తాతయ్య.

"నేనెవరో మీకు తెలియదు తాతయ్యా! కానీ నేను మాత్రం మీలాంటి తాతయ్యల్తో మాట్లాడాలనే వచ్చాను".

"ఏం మాట్లాడాతావమ్మా?"

"మీరిక్కడ పడుకొన్నారేం తాతయ్యా?"

"ఇంటికంటే గుడి బద్రమని!"

"మీకు ఇల్లు లేదా తాతయ్యా?"

"అద్దో... అక్కడ కనిపించే పచ్చమేడ మాదేనమ్మా!"

"మేడలు సంపాదించిన మీకు అంత నీడకు కరువయిందా? మీకు ఎవ్వరూ లేరా తాతయ్యా?"

"ఎందుకు లేరమ్మా? అందరూ ఉండారు. లచ్చణంగా ఉండారు. కూతుళ్ళకు పెండ్లిండ్లు చేసినాను. వాళ్ళ కాపురాలకు వాళ్ళు పొయ్‌నారు. కొడుకులకు పెండ్లిండు చేసినాను. కోడండ్లు కాపరానికొచ్చినారు."

"అయితే మీకింకేం కొదవ తాతయ్యా!"

"ఏ కొదవా లేదమ్మా? ఇద్దో నీమాదిర పలకరించేవాళ్ళే కొదవ!"

"మీరు మాత్రం మీ పిల్లల్ని ఏ కొదవా లేకుండా సాకినారు గదా?"

"అవునమ్మా! అయినా ఒక్క మాట చెప్తా వింటావా? ఈ వయస్సులో వేళ వేళ కన్ని నీళ్ళు, వేళకంత తిండి, నీ మాదిర పలకరించేవాళ్ళు దొరికితే– ఈ పాడు బతుకుమీద ఆశ పెరిగిపోతింది. ఇంకా బతకాల, ఇంకా బతకాల అనిపిస్తింది. ఇంటికొచ్చిన చుట్టానికి సకల మరేదలు జరిగిపోతా

ఉంటే అయిదు రోజులుండేవాడు పది రోజులు కదలకుండా తిష్టేస్తాడు. వాడు ఇంటికి బరువవుతాడు. నాలాంటోడు బూఁవికి బరువవుతాడు. ఎందుకమ్మా?"

తాత చెప్పిన జీవిత సత్యాన్ని జీర్ణించుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంది అరుణ.

బదులు పలక్కుండా నిలబడిన అరుణ ముఖంలోకి సూటిగా చూశాడు తాతయ్య. బరువుగా గుండెల నిండుకు గాలి పీల్చుకొన్నాడు.

"అయ్యో! నా మతిమండా! నాపాటికి నేనేదో వాగతానే ఉండా. నీ ఆకిలి నీ మొకంలో కనిపిస్తానే ఉండాది. అయినా నేను చెయ్యగలిగింది మాత్రం ఏఁవుండాదిలే. నా కర్మ ఇట్లా కాలిపోతా ఉంటే? నా చెయ్యి సాగేటప్పుడా? ఆకలి మొకం నా కంట్లో.... హుఁ!"

"నాకేం తాతయ్యా! బస్సెక్కితే గంటలోపుగా ఇల్లు చేర్తాను. మరి నీ సంగతి?"

"వస్తిందమ్మా వస్తింది. అద్దో ఆ కుక్కకూ, నాకూ అంత కవళం వస్తింది."

అరుణ కడుపులో చెయ్యేసి దేవినట్లయింది. తాత మొగాన్ని చూసే ధైర్యాన్ని కూడా కోల్పోయింది. 'వెళ్ళొస్తాను తాతయ్యా!" అని చెప్పడానిక్కూడా గొంతు పెగల్లేదు!

"ఏ పున్నెం చేసిన కడుపున పుట్నావో? గురుగుపువ్వు మాదిరుండావు. వేళకంత బువ్వ తినకపోతే వడిలిపోతావు. నాకు పంపించే తిండి? హుఁ! వద్దులే బిడ్డా వద్దు. పొద్దు తిరిగిపోతా ఉండాది. ఇల్లు చేరేకుందికే యాళవితిందో ఏమో? పొగులు మాటలు పన్చేటు కానీ పద తల్లీ! పద." బరువుగా నిట్టూరుస్తూ తాత తల వంచుకొన్నాడు.

అరుణ కన్నుల్లో పలుచని కన్నీటి పొర! ఎలా నడిచిందో ఆ ఎండలో మూడు కిలోమీటర్లు! ఒంటిమీద స్పృహ లేకుండా నడిచింది. ఎలా ఎక్కిందో బస్సెక్కింది. ఎలా గడిచిందో తనకు తెలియకనే బస్సులో గంట గడిచిపోయింది.

అరుణ పట్నం బస్సు స్టాండ్‌లో బస్సు దిగింది. రిక్షా తొక్కుతున్నదీ ఒక ముసలి జీవుడే! అతన్ని కదిపితే ఇంకేమి వినవలసివస్తుందో? ఈ పూటకీ అనుభవాలు చాలు అన్నట్లుగా అరుణ రిక్షాలో బుద్ధిగా కూర్చొనింది. మిట్టలమీద ఆయాసపడ్తూ గుంతల్లో పడ్తూ లేస్తూ రిక్షా ముందుకు సాగిపోతూ ఉంది.

ఎండపొద్దు. ఎగిరెగిరి పడ్తున్న రిక్షా. ఆ రిక్షాలో మనసులో మనసు లేకుండా కూర్చొన్న మగువ. ఒంటిలోని శక్తినంతా పిక్కల్లోకి నెట్టి రిక్షా తొక్కుతున్న చెక్క పేడులాంటి బక్క మనిషి- దయతలచినట్లుగా ఆ మహాపట్నంలో రోడ్డు చరచరా వెనక్కు వెళ్ళిపోయింది. రిక్షా ఇంటిని సమీపించింది.

ఇల్లు దగ్గర పడేసరికి రిక్షా వేగం కూడా తగ్గింది. నెమ్మదిగా ముందుకు కదులుతున్న రిక్షా నుంచి అరుణ "నాన్నా!" అని అరుస్తూ ఎగిరి కిందికి దూకింది. 'ఏఁవయిందో? ఏఁవో?' అని అదిరిపడి రిక్షావాడు తటాలున రిక్షాను ఆపుచేశాడు.

అరుణ లేడికూనలా పరుగెత్తుతూ ఉంది. ఉన్నట్టుండి కిందికి దూకి ఆ అమ్మాయి ఎందుకలా పరుగెత్తుతూందో అర్థం కాకుండా రిక్షావాడు అటువైపే చూస్తున్నాడు.

ఇంటి ముందర ఆగిన రిక్షాలో నుండి దిగుతూ తండ్రి బోర్లగిల పడ్డాడు. ఆ భారీ శరీరాన్ని లేపడానికి తల్లి అవస్థపడ్తూ ఉంది.

పరుగులమీద ఇంటి వాకిట్లో వాలిన అరుణ తల్లికి సాయం పట్టింది. ఇద్దరి చేతుల మోపున పైకి లేచిన తండ్రి- అరుణవైపు ఒక్క చూపు చూశాడు. వెంటనే చూపులు మరల్చుకొన్నాడు. ఆయన చూసిన చూపుల్లో ఎన్ని భావాలో?

ఆ చూపుల్ని తట్టుకోలేక అరుణ తల వాలిపోయింది. ఒక భుజానికి తాను, ఇంకొక భుజానికి తల్లి ఆధారంగా తండ్రిని మెల్లగా ఇంట్లోకి నడిపించుకొని వెళ్ళింది అరుణ. పడకమీద మెల్లగా పడుకోబెట్టింది. గబగబా వీధి వాకిట్లోకొచ్చింది. అప్పటికే తాను వచ్చిన రిక్షావాడు వాకిట్లో నిలబడి ఎదురుచూస్తున్నాడు. వాడికి డబ్బులిచ్చింది. వాడేదో చిల్లర డబ్బులు తిరిగి ఇవ్వబోతూంటే- "ఉంచుకోపో!" అని అంటూ ఆదరాబాదరా ఇంట్లోకి దారితీసింది.

"నూరేండ్లు సల్లంగా బతుకు తల్లీ!" అన్న రిక్షావాడి ఆశీస్సులు చెవిని పడుతూంటే- 'ఎందుకూ? ఇలా బాధలు పడడానికా?' అని నిట్టూరుస్తూ తండ్రి గదిలోకి వెళ్ళింది.

పడకమీద తండ్రి వెల్లకిలా పడుకొన్నాడు. కండ్లు మూసుకొన్నాడు. ఏదో నిరాశతో కూడుకొన్న అసంతృప్తి కనిపిస్తూ ఉంది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు చాలా బరువుగా సాగుతున్నాయి. తల్లి పక్కన కూర్చొని మెల్లగా ఎదమీద నిమురుతూ ఉంది.

"ఏఁవయిందమ్మా?" అరుణ తల్లిని ఆతురతగా అడిగింది.

"ఏఁవవుతుందమ్మా? ఉడిగిన ప్రాణాలకన్నీ సమస్యలే? బి.పి. పేషంట్ కదా? ఉన్నట్లుండి బి.పి. పెరిగిపోయింది. మనిషి లేస్తే పడిపోతున్నారు. ఎవరి ధ్యాసలో వాళ్ళుంటే ఏం చేయాలి చెప్పు? డాక్టర్ దగ్గరికి వెళ్ళొస్తున్నా!"

"ఇంట్లో ఎవరూ లేరామ్మా?" రెట్టించింది అరుణ.

"ఎందుకు లేరమ్మా? అందరూ ఉన్నారు. కనిపించలా?" ఎంతో నెమ్మదిగా సమాధానం చెప్పినట్లున్నా ఆ మాటల్లో నిష్ఠూరం తొంగిచూస్తూనే ఉంది.

అరుణ మారుమాట్లాడకుండా నెమ్మదిగా హాల్లోకి వచ్చి చూసింది. ఆడే దానికి తోడు లేకపోయినా అన్నయ్య ఒక్కడే కూర్చొని పేకాట ఆడుకొంటున్నాడు. వదినా మరదళ్ళు ఇద్దరూ టి.వి. ముందు కూర్చొని క్రికెట్ ఆటలో లీనమై ఉన్నారు. రవిశాస్త్రి కొట్టిన బౌండ్రీతో లక్ష రూపాయల లాటరీ తామే కొట్టేసినంత హంగామా చేస్తున్నారు. 'ఇంతమంది ఇంట్లో ఉన్నా రోగిష్టి తండ్రిని చూసుకొనే దిక్కులేదు. 'ఛీ! ఏం మనుషులో? వాళ్ళ పిచ్చి వాళ్ళదే కానీ...' అని ఆలోచిస్తుంటే- 'ఎంత నంగనాచిగా ఆలోచిస్తున్నావ్! డాక్టరేట్ తెచ్చుకోవాలన్న నీ పిచ్చి మాత్రం

తక్కువయిందా?' అని అంతరాత్మ నిలదీసి అడుగుతున్నట్టుంటే– అరుణ దెబ్బతిన్న హరిణి అయింది. తడబడుతూ వెళ్ళి పడకమీద ఒరిగిపోయింది.

అలసి సొలసిన శరీరం. ఆవేదనతో నలిగిపోతున్న గుండె. ఆకలితో అరుస్తున్న పేగులు. నోట్లోకి వెళ్ళనని సమ్మె చేస్తున్న నాలుగు వేళ్ళు– అరుణ పడకమీద మెలికలు తిరుగుతూ ఉంది. ఆ పరిస్థితిలో నిద్ర ఒక్కటే దివ్యౌషధం. అదే రానంటూ ఉంది. కండ్లు మూసుకొనింది. ప్రాణాయామం చేస్తే నిద్ర వస్తుందని ఎవరో? ఎప్పుడో? అనిన మాట మనసులో మెదిలి ఆ ప్రయత్నం కూడా చేసింది. పడక నలిగిపోతున్నదే తప్ప ఫలితం కనిపించలేదు.

అటువంటి పరిస్థితుల్లో ఆమె మనసుకు కాస్త ఊరట కలిగించేది సముద్రతీరమొక్కటే! ఆ ఆలోచన రావడమే తరువాయి. పడకమీద నుంచి చివాలున పైకి లేచింది. అప్పుడు ఆమె దృష్టి ఎదురుగా గోడమీద పడింది. ఆ గోడమీద గణపతి బొమ్మ. తననే చూసి వెక్కిరిస్తున్నట్లుంది. ఆ వెక్కిరింపుల్ని సహించలేనట్లుగా ఆమె తలవంచింది. వంచిన తలెత్తకుండా స్నానాల గదికి నడిచింది. అలసట తీరేటట్లుగా స్నానం చేసింది. బట్టలు మార్చుకొనింది. అప్పటికే అన్నగారు చక్కగా ముస్తాబై 'క్లబ్'కు బయలుదేరుతున్నాడు. వదినె మరిది ఎదురెదురుగా కూర్చుని ఆవేళ క్రికెట్ ఆటలో విశేషాల్ని విశ్లేషించి ఆనందాన్ని అనుభవిస్తున్నారు. తండ్రి నిద్రపోతున్నాడు. తల్లి కాఫీ కలిపి అందరికీ ఇస్తూ ఉంది. తనకూ ఇచ్చింది.

"అమ్మా! నీ చేతి కాఫీ ఉంటుంది చూడు!" అని లొట్టలేస్తూ తాగే అరుణకు ఆ పూట తలకొట్టేసినట్లయింది. మందు మింగినట్లు మింగలేక మింగింది– మనస్సంతా చేదుగా! అయితే ఎవరితో చెప్పకుండా బయల్దేరింది!...

అరుణ సముద్ర తీరంలో కూర్చొనింది!

ఆమె దినమూ చూస్తున్న సముద్రమే! విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తన గదిలో కూర్చుంటే కనిపించే సముద్రమే! ప్రతి దినమూ చూస్తున్నా ఆ సముద్రం ఎప్పటికప్పుడు కొత్తగానే కనిపిస్తూ ఉంటుంది. కొత్త కొత్త భావాల్ని రేకెత్తిస్తూ ఉంటుంది.

తెల్లంచు నీలపు దుప్పటిని తూర్పు దిక్కంతా పరిచినట్లు ఆరవేస్తే ఆ దుప్పటి గాలి తాకిడికి ఎగిరెగిరి పడ్తున్నట్లుంది. పసిడి కిరణాలు నీలాల అలల్తో మేలమాడుతున్నాయి. ఆ అలలు కోపమొచ్చిన త్రాచు పడగను పైకి లేపినట్లు లేస్తూ, అంతలోనే సాకుడు కుక్క కాళ్ళ దగ్గర ఒదిగినట్లు ఒదిగిపోతూ బంగారు కాంతుల్తో బంతులాడుతున్నాయి!

ఆ మనోహర దృశ్యం ఆమె మనసును తాకలేకపోతూ ఉంది.

హరిజనవాడలో కుక్కి మంచంమీద అవ్వ.... ఇంటి కంటే గుడి భద్రమని గుళ్ళో తిన్నెమీద తాత... ఎవరి పిచ్చిలో వాళ్ళుంటే ఇంట్లో వయసుమళ్ళిన తల్లిదండ్రులు– మనసులో మెదులుతున్నారు. వార్ధక్యం మనిషికింత శాపమా? అని మథనపడుతున్న ఆమె దృష్టి సముద్రంవైపు మళ్ళింది.

ఎదురుగా సముద్రం. ఎంత గంభీరంగా ఉందా సముద్రం? ఎంత లోతుగా ఉందా సముద్రం? ఎంత నిండుగా ఉందా సముద్రం? అంతర్భాగాన ఎంత నిశ్చలంగా ఉంటుందా సముద్రం? కానీ అంచుల్ని తాకేటప్పుడు మాత్రం ఆటుపోటుల్ని తట్టుకోలేక ఘోషిస్తూ ఉంది. మానవ జీవితాలు కూడా అంతేనేమో?

ఎంతో నిర్భయంగా, ఎంతో నిబ్బరంగా, ఎంతో బాధ్యతగా– సాగర సమానమైన సంసారాల్ని ఈదిఈది జీవితపు చివరి అంచుల్ని చేరి ఆటుపోట్లకు తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నారు. ఆ ఘోషను గుండెల్లో అదిమిపట్టుకొని కుమిలిపోతున్నారు.

మెత్తని ఇసుక రేణువులమీద గొంతు కూర్చొని మోకాళ్ళమీద తలను ఆనించి సముద్రాన్ని చూస్తూ ఆలోచిస్తున్న అరుణ పాదాల్ని అలమీద అలగా వచ్చి తాకుతున్నాయి.

హరిజనవాడలో అవ్వ... గుడిలో తాత... ఇంట్లో తండ్రి– ఆ అలల రూపాన కదిలి తన పాదాల్ని పట్టి బతిమాలుతూ– 'ఈ ఘోషకు అంతమెప్పుడో చెప్పమ్మా! చెప్పు?" అని అడుగుతున్నట్లుంది.

అరుణ కనుకొలకుల్లో రెండు కన్నీటిబొట్లు! అడ్డూ ఆపు లేకుండా జారి ఆ అలలమీద పడ్డాయి– నీళ్ళూ నీళ్ళూ కలిసిన ఆ ఘోషకు మరింత బలం చేకూరుస్తున్నట్లుగా! ●

ఆంధ్రప్రభ
(10, జూన్ 1987)